



కిలారు గృహంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే వనమా

## పార్టీ ఎన్నికల వ్యూహంపై సమాలోచనలు

పాల్వంచ రూరల్, అక్టోబర్ 25 : కొత్తగూడెం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు బుధవారం పాల్వంచలోని రైతుబంధు సమితి నాయకుడు కిలారు నాగేశ్వరరావు ఇంట్లో సమావేశమయ్యారు. పార్టీ ఎన్నికల వ్యూహంపై సమాలోచనలు చేశారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకుడు కనగాల బాలకృష్ణ ఉన్నారు.

## నేటినుంచి 23 పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్

### డీఈవో వెంకటేశ్వరచారి



మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరచారి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 25 : దసరా సెలవుల అనంతరం గురువారం నుంచి జిల్లాలోని అన్ని పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న సందర్భంగా సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు డీఈవో వెంకటేశ్వరచారి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో జూమ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ ఆదేశాల మేరకు విడతలవారీగా జిల్లాలో ముఖ్యమంత్రి అల్పాహారం పథకం అమలుకానుందని పేర్కొన్నారు. మొదటివిడతలో జిల్లాలోని 23 మండలాల్లో మండలానికి ఒక పాఠశాల చొప్పున మొత్తం 23 పాఠశాలల్లో కార్యక్రమం ప్రారంభం కానున్నదని, తొమ్మిది విడతల్లో మొత్తం 1,334 పాఠశాలల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కో ఆర్డినేటర్లు సైదులు, సతీశ్‌కుమార్, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

### జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు



ప్రచారంలో పాల్గొన్న జడ్పీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి, అక్టోబర్ 25 : కొత్తగూడెం నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు కోరారు. బుధవారం రుద్రంపూర్, గౌతంపూర్ పంచాయతీల్లో బూత్‌లెవల్ కమిటీలను ఏర్పాటు చేసుకొని బీఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీ వచ్చే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. నవంబర్ 5వ తేదీన సీఎం కేసీఆర్ జిల్లాకు రానున్నందున జన సమీకరణ చేసుకొని అత్యధికంగా హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అబ్దుల్ ఉమర్, ఎంపీపీ బదావత్ శాంతి, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, గూడెల్లి యాకయ్య, రాజేంద్రప్రసాద్, కన్నీ, నిమ్మల సాగర్, బుచ్చన్న, శివ నాగమణి, గౌతంపూర్ పంచాయతీ, ధన్బాద్ పంచాయతీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫ్లయింగ్ స్క్వాడ్, టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

### కాంగ్రెస్ నేత పొంగులేటి బంధువు ఇంట్లో గోడ గడియారాలు స్వాధీనం

### రూ.46,89,310 విలువైన 9,570 వాచ్‌లు సీజ్





ఖమ్మంలోని దయాకర్‌రెడ్డి ఇంట్లో నిల్వ చేసిన గోడ గడియారాల బాక్స్‌లు, (ఇన్‌సెట్) గడియారం

ఖమ్మం అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : శాసనసభ ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రభావితం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నాలకు ఫ్లయింగ్ స్క్వాడ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు చెక్ పెట్టారు. మాజీ ఎంపీ, కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కమిటీ కో-కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీప బంధువు, ఖమ్మంలోని దయాకర్‌రెడ్డి ఇంట్లో బుధవారం దాడులు చేసి రూ.46 లక్షల విలువైన గోడ గడియారాలను అధికారులు పట్టుకున్నారు. మాజీ ఎంపీ పొంగులేటి పాలేరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. అయితే ఆయన అభ్యర్థిత్వం ఖరారు కాకముందే అనుచరులు ఆయనే అభ్యర్థి అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకే ముందస్తుగా ఈ వాచ్‌లను సిద్ధం చేసి భద్రపరిచినట్లు ప్రచారం జరుగుతోంది. గడియారాల కొనుగోలుకు సంబంధించి బిల్లులపై ఎన్నికల అధికారులు ఆరా తీయగా.. సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో వాటిని సీజ్ చేశారు. దయాకర్‌రెడ్డి ఇంట్లో పెద్ద ఎత్తున వాచ్‌లు దొరకడం రాజకీయంగా కలకలం రేపుతోంది. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీల్లో రూ.46.89లక్షల విలువ చేసే రూ.9,570 గోడ గడియారాలను అధికారులు సీజ్ చేశారు. గడియారాలకు సంబంధించి బిల్లులు, ఇతర ఆధారాలు చూపించాలని అధికారులు కాంగ్రెస్ నాయకులను అడిగినప్పటికీ సమాధానం అందించలేదని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సుమ తెలిపారు. ఆధారాలు చూపిస్తే వాటిని రిలీజ్ చేస్తామని పేర్కొన్నారు. కాగా.. వాచ్‌లపై పొంగులేటి ఫొటోతో తన కూతురు వివాహం సందర్భంగా.. అని ముద్రించి ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

# ప్రజల రక్షణే పోలీసుల ప్రథమ లక్ష్యం

- ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 25 : ప్రజల రక్షణే పోలీసుల ప్రథమ లక్ష్యమని, దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరుల త్యాగాలను ప్రతి పౌరుడు స్మరించుకోవాలని ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా పోలీస్ అధికారులు బుధవారం నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని సెంట్రల్ పార్క్ నుంచి మొదలైన ర్యాలీ ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్ద యూ టర్న్ తీసుకుని కొత్తగూడెం రైల్వేస్టేషన్, బస్టాండ్ సెంటర్, పోస్టీఫీస్ సెంటర్ల మీదుగా విద్యానగర్‌కాలనీ బైపాస్ రోడ్డు వద్దకు చేరుకుని, మళ్లీ యూ టర్న్ తీసుకొని సింగరేణి హెడ్ ఆఫీస్ మీదుగా రుద్రంపూర్ పార్కు వరకు సాగింది. ర్యాలీలో సుమారు 150మంది పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ వినీత్ పోలీస్ అమరవీరుల స్మారక మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది పోలీస్ అమరవీరుల త్యాగాల ఫలితంగానే ప్రజలంతా స్వేచ్ఛావాయువులను పీల్చగలుగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఆపరేషన్స్) టి. సాయి మనోహర్, ఏఆర్ అదనపు ఎస్పీ విజయ్‌బాబు, భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్, సీఆర్పీఎఫ్ అధికారులు రితేష్ థాకూర్, సెంతిల్‌కుమార్, కమల్ వీర్, రజిత, సందీప్‌రెడ్డి, 6వ బెటాలియన్ అదనపు కమాండెంట్ అంజయ్య, డీఎస్పీలు షేక్ అబ్దుల్ రెహమాన్, ఎన్.వెంకటేశ్, కేవీ రమణమూర్తి, మల్లయ్యస్వామి, సీతారాం, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, పీఆర్వో దాములూరి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ వినీత్, పోలీస్ అధికారులు

## వైభవంగా అమ్మవారి శోభాయాత్ర



పట్టణంలో అమ్మవారి శోభాయాత్ర

పాల్వంచ రూరల్, అక్టోబర్ 25 : దసరా సందర్భంగా నవరాత్రులో మండపాల్లో పూజలందుకున్న శ్రీకనకదుర్గ అమ్మవారి శోభాయాత్ర మండలం, పట్టణంలో బుధవారం రాత్రి శోభాయమానంగా జరిగింది. అమ్మవారికి భక్తులు పూజలు చేసి ఘనంగా వీడ్కోలు పలికారు. గాంధీనగర్, మార్కెట్ ఏరియా, మండలంలోని నాగారంలో అమ్మవారి శోభాయాత్ర కనులపండువగా జరిగింది.

## పేకాటస్థావరంపై దాడి

పాల్వంచ రూరల్, అక్టోబర్ 25 : పట్టణ పరిధిలోని కిన్నెరసాని రోడ్‌లో పేకాట స్థావరంపై పట్టణ పోలీసులు బుధవారం దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7 వేలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని కిన్నెరసాని రోడ్డులో ఉన్న ఓ షాపులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న స్థానికుల సమాచారం మేరకు పట్టణ ఎస్సై రాము తన సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.7,240 నగదు, 3 ద్విచక్రవాహనాలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## డైరెక్టర్ బలరాంకు రజాక్ పరామర్శ



డైరెక్టర్ బలరాంను పరామర్శిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రామవరం, అక్టోబర్ 25 : సింగరేణి డైరెక్టర్(పా) బలరాంనాయక్ తండ్రి హన్యానాయక్ ఈ నెల 15వ తేదీన మృతిచెందిన విషయం తెలిసిందే. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ మహబూబ్‌నగర్ జిల్లా బాల్‌నగర్ మండలం తిరుమలగిరి గ్రామానికి వెళ్లి బుధవారం డైరెక్టర్(పా) బలరాంతో పాటు అతని సహోదరులు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. డైరెక్టర్(పా) తండ్రి హన్యానాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## ఏరియా వర్క్‌షాప్‌లో సహపంక్తి భోజనాలు



భోజనాలు వడ్డిస్తున్న ఏరియా జీఎం

రామవరం, అక్టోబర్ 25 : సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్‌లో బుధవారం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఏరియా జీఎం శాలెంరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దసరా ఉత్సవాలు తొమ్మిదిరోజులు పురస్కరించుకొని అన్నదానంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం దగ్గరుండి కార్మికులకు భోజనాలు వడ్డించారు. అందరితో కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఏజీఎం దుర్గాప్రసాద్, ఏరియా వర్క్‌షాప్ ఇన్‌చార్జి టి.శ్రీకాంత్, ఇంజినీర్లు అనిల్, శంకర్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రమణారెడ్డి, యూనియన్ ప్రతినిధులు టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, మల్లికార్జున్, ఇతర సభ్యులు, ఏరియా వర్క్‌షాప్ ఉద్యోగులు పాల్గొన్నారు.